# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 16-09-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **భారత్ ను మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఉద్ఘాటించారు.**
2. **విశాఖ ఉక్కు కర్మాగారంలో బొగ్గు కొరత సమస్యను కేంద్ర ప్రభుత్వం పరిష్కరిస్తుందని కేంద్ర ఉక్కు, ప్రధాన పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ తెలిపారు.**
3. **రాష్ట్రంలోని దేవాలయాలకు త్వరలో నూతన పాలకమండళ్లను ఏర్పాటు చేస్తున్నామని రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రాంనారాయరెడ్డి తెలిపారు.**
4. **రాష్ట్రంలో వరదల కారణంగా ఖరీఫ్ సీజన్ పంటలకు ఈ-క్రాప్ నమోదు గడువును ఈనెల 25వ తేదీ వరకు పొడిగించినట్లు వ్యవసాయశాఖ డైరెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు.**
5. **ఉచిత ఇసుక విధానంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఒకే ఇసుక రవాణా ఛార్జీలను నిర్ణయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.**

==========================

భారత్ ను మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఉద్ఘాటించారు. గుజరాత్‌లో పర్యటిస్తున్న ప్రధానమంత్రి ఈరోజు గాంధీనగర్‌లోని నాలుగవ పునరుత్పాదక ఇంధన పెట్టుబడిదారుల సమావేశం 2024 సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధాన మంత్రి మాట్లాడుతూ, పునరుత్పాదక రంగంలో భారత్ గణనీయమైన ప్రగతిని సాధిస్తోందని అన్నారు. 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మారేందుకు మార్గసూచిని రూపొందించామని తెలిపారు. తదనుగుణంగా ఎన్డీయే ప్రభుత్వం ఏర్పాటైన 100 రోజుల్లో ప్రభుత్వ ప్రాధాన్యతలను ప్రదర్శించామని ప్రధానమంత్రి పేర్కొంటూ,

వాయిస్ (46 సెకన్లు)

ఈ సదస్సులో ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్, తెలంగాణ, ఉత్తర ప్రదేశ్ భాగస్వామ్య రాష్ట్రాలుగా పాల్గొంటున్నాయి. ఈ సమావేశంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పాల్గొన్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో ఆర్థిక వనరుల సమీకరణ గ్రీన్ హైడ్రోజన్ భవిష్య ఇంధన పరిష్కారాలు వంటి అనేక అంశాలపై ప్రత్యేక చర్చలు జరుగుతాయి. ఈనెల 18వ తేదీన జరగనున్న ముగింపు సమావేశంలో ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్ ఖడ్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగిస్తారు.

--------------------------

విశాఖ ఉక్కు కర్మాగారంలో ఉత్పత్తిపై ప్రభావం చూపుతున్న బొగ్గు కొరతను కేంద్ర ప్రభుత్వం పరిష్కరిస్తుందని కేంద్ర ఉక్కు, ప్రధాన పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ తెలిపారు. నిన్న రాజమహేంద్రవరంలో కేంద్రమంత్రి మాట్లాడుతూ, వీలైనంత త్వరలోనే బొగ్గు కొరతకు ప్రత్యామ్నాయం కేంద్ర ప్రభుత్వం చూపించేందుకు కృషి చేస్తుందని చెప్పారు. రాష్ట్రాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం, కట్టుబడి ఉందని, అమరావతి రాజధాని, పోలవరం సాగునీటి ప్రాజెక్టులకు ఇప్పటికే నిధులు విడుదల చేసిందని మంత్రి పేర్కొన్నారు.

---------------------------

రాష్ట్రంలోని దేవాలయాలకు త్వరలో నూతన పాలకమండళ్లను ఏర్పాటు చేస్తున్నామని రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రాంనారాయరెడ్డి తెలిపారు. తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని కుటుంబ సమేతంగా మంత్రి ఈరోజు దర్శించుకున్నారు. అనంతరం ఆలయం వెలుపల పాత్రికేయులతో మాట్లాడుతూ, రాష్ట్రంలో వరద బాధితులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుదన్నారు. వరద బాధితుల వివరాలను ప్రభుత్వం సేకరించిందని.. వారికి ఆర్థికంగా చేయూతనిచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి పేర్కొన్నారు.

---------------------------

రాష్ట్రంలో వరదల కారణంగా ఖరీఫ్ సీజన్ పంటలకు ఈ-క్రాప్ నమోదు గడువును ఈనెల 25వ తేదీ వరకు పొడిగించినట్లు వ్యవసాయశాఖ డైరెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. పంటల బీమా అమలుకు ఈ-క్రాప్ లో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని తెలిపారు.ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన- పీఎంఎఫ్ బీవై ద్వారా వాతావరణ ఆధారిత పంటల బీమాను ప్రభుత్వం అమలు చేస్తోందని, ఖరీఫ్ కాలానికి ఎంపికచేసిన పంటలకు ఉచితంగా బీమా కల్పిస్తుందని తెలిపారు.

---------------------------

ఉచిత ఇసుక విధానంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఒకే ఇసుక రవాణా ఛార్జీలను నిర్ణయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆ ప్రకారమే రవాణాదారులు వినియోగదారుల నుంచి ఇసుక రవాణా ఛార్జీలు వసూలు చేయాల్సి ఉంటుందని,. అంతకంటే ఎక్కువగా వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని కర్నూలు జిల్లా గనులు, భూగర్భశాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇసుక రవాణాదారులందరూ ప్రభుత్వం నిర్ణయించిన రవాణా ఛార్జీలకు ఆమోదం తెలుపుతూ గనుల శాఖ దగ్గర ఒప్పందం చేసుకోవాలని, ఆ తర్వాత ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న ఇసుక వినియోగదారులకు రవాణాదారుల నుంచి ఇసుక సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటారని తెలిపారు.ఇసుక వినియోగదారుల నుంచి అధిక రవాణా ఛార్జీలు వసూలు చేస్తున్నట్లు ప్రభుత్వం దృష్టికి వచ్చిందని ఈ మేరకు ఒకే రకమైన ఇసుక రవాణా ఛార్జీల విధానాన్ని అమలులోకి తెచ్చినట్లు తెలిపారు.

---------------------------

ప్రజల రవాణా సౌకర్యార్థం ఎన్డీయే కూటమి ప్రభుత్వం ప్రజలకు కొత్త బస్సులను అందుబాటులోకి తెస్తోందని రాష్ట్ర రోడ్డు రవాణాశాఖ మంత్రి ఎం.రాంప్రసాద్‌రెడ్డి, పేర్కొన్నారు. శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం ఆర్టీసీ డిపోలో పుట్టపర్తి, హిందూపురం, కదిరి డిపోలకు కేటాయించిన 6 కొత్త బస్సులను మంత్రి నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ, వచ్చే ఐదేళ్లలో 5 వేల కొత్త బస్సులను ఆర్టీసీలో ప్రవేశపెట్టనున్నామని తెలిపారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో 14 వందల విద్యుత్ బస్సులు అందుబాటులోకి తీసుకొస్తున్నామని మంత్రి పేర్కొన్నారు.

---------------------------

స్వచ్ఛ భారత్ అభియాన్‌లో భాగంగా రేపటి నుంచి అక్టోబర్ 2 వరకు ఏలూరు జిల్లా వ్యాప్తంగా స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాలపై జిల్లా స్థాయిలో భాగస్వామ్య సంస్థలతో ఇప్పటికే ఉన్నత స్థాయి సన్నాహక సమావేశం నిర్వహించామన్నారు. మహాత్మ గాంధీ జయంతి సందర్భంగా ప్రతి సంవత్సరం అక్టోబర్ 2వ తేదీన స్వచ్ఛ భారత్ దివస్‌గా పాటిస్తున్నామని చెప్పారు. "స్వభావ స్వచ్ఛత, సంస్కార స్వచ్ఛత" ఇతివృత్తంగా స్వచ్ఛతా హి సేవ 2024ను నిర్వహిస్తున్నామని తెలిపారు.

--------------------------

రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేటు వైద్య కళాశాలల్లో 2024-25 సంవత్సరానికి గానూ తొలి దశ కౌన్సెలింగ్ ఎంబీబీఎస్ కన్వీనర్ ప్రవేశాలను ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం కేటాయించింది. ప్రవేశాలను పొందిన విద్యార్థులు ఈనెల 19వ తేదీ లోపు కళాశాలల్లో చేరాలని ఆదేశించారు. దివ్యాంగ, మరికొన్ని ప్రత్యేక విభాగాల్లో తుది జాబితా ఇంకా సిద్ధం కానందున ఆ విభాగాల ప్రవేశాలను ప్రకటించలేదని తెలిపింది. మొత్తం 3 వేల 879 ప్రవేశాలకు గాను తొలి దశ కౌన్సెలింగ్‌లో 3 వేల 507 ప్రవేశాలు భర్తీ అయ్యాయని అధికారులు వెల్లడించారు. అదే విధంగా కొత్త ప్రభుత్వ వైద్య కళాశాలల్లో, ప్రైవేటు కళాశాలల్లో యాజమాన్య కోటా ప్రవేశాలకు సంబంధించిన ప్రాథమిక తుది మెరిట్ జాబితాను కూడా విడుదల చేశామని వెల్లడించారు. కాగా అక్టోబర్ 1 నుంచి తరగతులు ప్రారంభం కానున్నాయని పేర్కొన్నారు.

--------------------------

చిత్తూరు జిల్లాలో రేపు చేపట్టే జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ అధికారులను ఆదేశించారు. చిత్తూరు కలెక్టర్ కార్యాలయంలో నులిపురుగుల నిర్మూలన కార్యక్రమ ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో ./జిల్లా కలెక్టర్ ఈ రోజు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా 19 సంవత్సరాలలోపు ఉన్న పిల్లలందరికీ తప్పనిసరిగా ఆల్బెండజోల్ మాత్రలు వేసేలా వైద్య ఆరోగ్య శాఖ విద్యాశాఖ, ఐసిడిఎస్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

--------------------------

రాష్ట్రంలోని ప్రస్తుత వాతావరణ పరిస్థితులను అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి డి.శేషసాయి కొద్దిసేపటి క్రితం ఆకాశవాణి విజయవాడ కేంద్ర ప్రాంతీయ వార్తావిభాగానికి తెలియజేస్తూ......

.....వాయిస్.... 27 సెకన్లు....

--------------------------

తిరుపతి జిల్లాలోని తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయంలో పవిత్రోత్సవాలు ఈరోజు నుంచి ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా ఈరోజు ఉదయం వేద పండితుల వేదమంత్రోచ్చారణల మధ్య పవిత్ర ప్రతిష్ట జరిగింది. రేపు పవిత్ర సమర్పణ ఉంటుందని, సెప్టెంబర్ 18 వ తేదీన పూర్ణాహుతితో పవిత్రోత్సవాలు ముగుస్తాయని తిరుచానూరు ఆలయ ప్రధాన అర్చకులు బాబు స్వామి తెలిపారు.

======================